# మారిన మనిషి

సిహెచ్. భారతి

మొదటి కథ

స్టేషన్‌లో సర్కార్ ఎక్స్‌ప్రెస్ కదలడానికి సిద్ధంగా వుంది. ఎక్కాల్సిన ప్రయాణికులు గబగబా ఎక్కుతూ, దిగే తొందరలో ఉన్న వారి సామాన్లు అడ్డురాగా, చిరాకుగా వాటిని ప్రక్కకు తోసేస్తూ రైలు ఎక్కడ కదిలిపోతుందోనని తోసుకుంటూ ఎక్కేస్తున్నారు. ఇక రైలు కదలడానికి రెండు నిమిషాలే టైము వుండనగా కొంత మంది హడావిడిగా రైలు దగ్గరకువచ్చి కోచ్‌ల దగ్గర ఆగి వాళ్ళ బెర్త్‌ల నెంబర్లు చూసుకుంటున్నారు. వేగంగా కంగారుగా రావడంతో ఆయాసంతో వున్నారు. సెండాఫ్ ఇవ్వడానికి వచ్చిన వాళ్ళు సాయం చెయ్యడంతో అందరూ రైలు ఎక్కారు.

రైలు కదిలి స్పీడందుకోవడంతో వాళ్ళు అన్నీసర్దుకుని ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. మాటలుకలిపి స్నేహితులయ్యారు. ఎనిమిది బెర్త్‌లున్న కోచ్‌లోని ఒక భాగంలో రెండు కుటుంబాలు ఉన్నాయి. సాయి - సాకేత్, సుధీర్ -సుహాసిని ఒక కుటుంబం. శారద - మాధవ్ పిల్లలు రమ్య సౌమ్యలు మరో కుటుంబం. వీళ్ళతోపాటు శారద అన్నకూతురు దీపిక కూడా వుంది. ఆ అమ్మాయి తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆ అమ్మాయి కూడా పిల్లలతో కలిసిపోయి వాళ్ళతో ఆడుకుంటూంది.

పిల్లలందరూ కంపార్ట్‌మెంట్ అంతా తిరిగేస్తున్నారు. వీళ్ళు చేస్తున్న అల్లరి, వీళ్ళ కేకలు - “చాయ్ చాయ్” “వేడి వేడి ఇడ్లీ” “పల్లీ పల్లీ” అనే అమ్మకాల కేకలతో కలిసి పోయి ఆదివారం సంతలో సందడిలా తయారైంది.

ఇక పిల్లలందరూ ‘అంత్యాక్షరి’తో మొదలు పెట్టి ‘తారంగం’ దాకా అనర్గళంగా పాడేస్తున్నారు.

జీన్స్‌ప్యాంట్ మీద పెద్ద గళ్ళ చొక్కా టకప్ చేసుకుని, పొడుగ్గా, గెడ్డంతో గంభీరంగా వుండి భుజానికి నల్లని బేగ్ తగిలించుకుని కూర్చున్న ఒక యువకుడు, ఈ అల్లరి తనకేమి పట్టనట్లుగా పేపరు చదువుతూ, చాటుగా అందరినీ పరిశీలనగా చూస్తున్నాడు. అతను పేపరు చదువుతున్నట్లుగా లేదు. అతను తన బేగ్‌ని క్రింద పెట్టి జేబులోంచి చైన్ తీసి క్రిందకు వొంగి సీటు కింద బేగ్ పెట్టి తాళం వేశాడు. చెమటను జేబురుమాలుతో తుడుచుకున్నాడు. తనని వాళ్ళు గమనిస్తున్నారేమోనని అందర్నీ ఓరకంటితో చూశాడు. ఎవరూ గమనించి వుండరనుకొని, ఫ్రీగా రిలాక్సింగ్‌గా కూర్చుని ఎదుట బెర్త్‌లో వున్న వారి వంక చూడసాగాడు.

సాయి సాకేత్, రమ్య సౌమ్య నలుగురు పిల్లలూ ముద్దుగా వున్నారు. అందరూ ఆరేళ్ళ లోపు వాళ్ళే. పిల్లలు ఆడుతూవుండగానే ఒకరు తెచ్చిన పదార్థాలు మరొకరు పంచుకుంటూ అందరూ భోజనాలు ముగించారు. వారి ఎదురుగా కూర్చున్న యువకునికి కూడా తాము తెచ్చు

కున్నవి తినడానికి ఇచ్చారు. అతను ఎంతో బలవంతంమీద తీసుకున్నాడు.

ఇక పిల్లలు అతని చుట్టూ చేరేరు. అంత వరకు ముభావంగా వున్నతను, వాళ్ళతో కలిసి పోయాడు. స్కూల్లో నేర్పిన రైమ్స్ పిల్లలచేత పాడించి వింటూ సంతోషించాడు.

"అంకుల్ మీ పేరేంటి? ఏ క్లాసు చదువు తున్నారు?" అడిగింది రమ్య.

"నా పేరు సిద్ధార్థ. నేను ఏంచదువుకో లేదమ్మా" అన్నాడు.

"ఎందుకు?... నీకు స్కూలంటే, టీచర్లంటే భయమా!" సాకేత్ అంది అమాయకంగా.

అవునన్నట్లుగా తల ఊపాడు వాళ్ళకు ఏం జవాబు చెప్పాలో తెలియక.

ఏదో స్టేషన్‌లో రైలు ఆగింది. దగ్గరగా వున్న షామియానాలో మైకుల్లోంచి వస్తున్న హుషారైన పాట రైలులోకి వినిపిస్తోంది. అది వింటూ పిల్లలు ఆ పాటకు తగినట్లుగా స్టెప్స్ వేస్తూ డ్యాన్స్ చేయసాగేరు. వాళ్ళ హావభావా లు, అభినయం చూసి అందరూ నవ్వసాగారు. వాళ్ళ అమాయకత్వం చూసాక సిద్దార్థకు మన సు కరిగిపోయి తను చేయబోయే పని గుర్తుకు వచ్చింది.

ఇప్పుడు ఇంత సరదాగా, ఆనందంగా కేరింతలతో వున్న వీళ్ళు కాస్సేపట్లో ఏమైపో తారో అన్న ఆలోచనరాగానే అతని మనసులో ఏదో చెప్పలేని బాధ ముసురుకుంది. బాధ నుండి తేరుకోవడానికి వెనక్కు జారబడి కళ్ళు మూసుకున్నాడు. ఇలాంటి పనులు తనకు కొత్త కాదు. ఇంతకన్నా ఘోరాలు సునాయాసంగా చేశాడు. ఈ పిల్లలను, ఆ రెండు కుటుంబాల ను చూశాక తనకు కొత్తగా ఈ రోజు అలజడి కలిగిందేమిటి. అందుకేనా మనిషికి భార్యపిల్ల

## నా మొదటి కథ

కొత్త రచయిత (త్రు) లను ప్రోత్సహించా లనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఈ శీర్షికలో 'మొదటి కథ' గా ఈ కథని ప్రచురిస్తున్నాం.

సిహెచ్. భారతి గారి ఈ మొదటి కథను ప్రముఖ రచయిత శ్రీ కె.బి. కృష్ణగారు కొన్ని మార్పులు, చేర్పులతో 'కథాకేళి' పాఠకులకు అందించారు. మా ప్రయత్నానికి సహకారం అందించిన వారికి మా కృతజ్ఞతలు.

-ఎడిటర్

కొత్త రచయితలకు శ్రీ కె.బి.కృష్ణ గారి సూచనలు...

- ★ సంభాషలను విడదీసి, సందర్భాన్ని బట్టి పేరాలు విడదీసి వ్రాయాలి. పెద్దపెద్ద పేరాలు చదవడానికి విసుగు పుట్టిస్తాయి.
- ★ అవసరమైన మేర పాత్రల రూపురేఖలను వర్ణిస్తే చదవడానికి ఆసక్తిగా ఉంటుంది.
- ★ 'సస్పెన్స్' అనేది చివరివరకూ కొనసాగిం చాలి. కథ మధ్యలోనే విషయం తెలిసిపోతే మిగిలిన కథ ఆసక్తికరంగా ఉండదు.
- ★ సీనియర్ రచయితల కథలను నిశితంగా గమనిస్తే త్వరలోనే మంచి రచనలు చేయగలరు.

లూ వుండాలంటారు.

ఇలా ఆలోచిస్తున్న సిద్దార్థకు అకస్మాత్తుగా ఛాతిలో నెప్పి అనిపించింది. వాటర్ బాటిల్లో నీళ్ళు గటగటాతాగేశాడు. కొంచెం బాధ తగ్గి నట్లనిపించి టాయ్‌లెట్ వైపు నడవబోయాడు. తగ్గిందనుకున్న నెప్పి మరల ఎక్కువ కావడంతో తూలి క్రిందపడబోయాడు, ఇది గమనించిన మాధవ్, సుధీర్‌లు ఇద్దరూ అతన్ని పట్టుకొని వాళ్ళ బెర్త్‌పై పడుకోబెట్టారు. మాధవ్ డాక్టర్ కావడంతో, సిద్దార్థకు వచ్చింది 'మైల్డ్ హార్ట్ ఎటాక్' అని గమనించి తన వద్దనున్న మెడికల్


KOCHERLA VR.

కిట్‌తో వైద్యం చేశాడు. అందరినీ దూరంగా ఉండమని, సిద్దార్థకు గాలి బాగా వచ్చేట్లు ఏర్పాటు చేశాడు. గుండెలపై నెమ్మదిగా మసాజ్ చేశాడు.

కొంచెంసేపటికి కళ్ళుతెరిచిన సిద్దార్థ తనకేసి అందరూ ఆత్రంగా చూడడం గమనించాడు.

పిల్లలందరూ "డాడీ! అంకుల్ కళ్ళు తెరిచారు" అన్నారు.

లేవబోతున్న సిద్దార్థను వారించి, మాధవ్ "కాసేపు విశ్రాంతి తీసుకుంటే మంచిది. మీరు ఇకనుండి ఎక్కువగా అలిసిపోయే పనులు చేయకండి" అన్నాడు.

శారద ఫ్లాస్కులోంచి పిల్లలకోసం తెచ్చిన హార్లిక్స్ ఒక కప్పులో పోసి ఇచ్చింది. మారు మాట్లాడకుండా తాగాడు సిద్దార్థ.

నెమ్మదిగా లేచి కూర్చుని తన వంక ఆందోళనగా, ఆత్రంగా చూస్తున్న పిల్లల్ని దగ్గరగా రమ్మని సైగ చేశాడు.

అంతే–

వాళ్ళంతా పరుగున అతని దగ్గరకు చేరారు. అతనికి గుండెనొప్పి వచ్చిన చోట చిన్నారి చేతులతో నిమురుతూ "అంకుల్! నొప్పి తగ్గిందా" అన్నారు ప్రేమ నిండిన చూపులతో.

వాళ్ళ ఆప్యాయతను చూసి అతనికి కళ్ళు తడి అయ్యాయి. బలవంతంగా నోరు పెగల్చుకుని "లేదమ్మా! ఇప్పుడసలు నొప్పేలేదు, మీ నాన్నగారు వైద్యం చేశారుగా దేముడి లాగా" అన్నాడు కృతజ్ఞతతో.

వెంటనే వాళ్ళు "అంకుల్! మీకు ఇకనుండి ఎలాంటి నొప్పిరాదు. మీరు చాలా మంచివారు" అన్నారు పెద్ద అరిందాల్లాగా.

సిద్దార్థ చిరునవ్వునవ్వేడు. తన మనసులో 'మీరు అనుకున్నంత మంచివాడిని కాదమ్మా' అనుకున్నాడు బాధతో.

తన ప్రాణాలను కాపాడిన వాళ్ళ ప్రేమానురాగాలకు, మానవత్వం మంచితనాలకు బదులుగా తానేమివ్వగలడు?. నిజంగా తాను మంచివాడు కానేకాదు. తామేం చేస్తున్నామో, తమధ్యేయం ఏమిటో తెలియని దుర్మార్గపు మనుషులగుంపులో ఇరుక్కుపోయాడు తను.

చాలాసేపు అంతర్మథనం తరువాత లేచి నిలబడ్డాడు సిద్దార్థ. అప్పటికి అందరూ నిద్రపోయారు.

ఒక గంట గడిచేసరికి అతని నిర్ణయానికి దైవం అనుకూలించినట్లుగా రైలు ఒక స్టేషన్ ముందు సిగ్నల్స్ లేక ఆగింది. ఇదే సమయమని సీటు క్రింద తను అమర్చిన రైలు మొత్తం పేల్చేయగల శక్తివంతమైన టైమ్‌బాంబ్‌ని రెండు చేతులతో పైకెత్తి పరిగెడుతున్న రైల్లోంచి దూరంగా విసిరేసి, పసిమొగ్గల్లాంటి భావిభారత పౌరులను ఒకసారి చూసి, గులాబీరేకుల్లా నవనవలాడుతున్న వాళ్ళను ముద్దాడి, పెద్దలందరికీ నమస్కరించి ఆగి వున్న రైల్లోంచి దిగిపోయాడు.

కొంచెందూరం పరుగెత్తిన సిద్దార్థ పెద్ద శబ్దంతో పేలిన టైమ్‌బాంబ్‌తోపాటు మాయమైపోయాడు.

చీకటిలోంచి వెలుగులోకి పయనించాలని, తన జీవనవిధానాన్ని మార్చుకోవాలని నిర్ణయించుకున్న సిద్దార్థ, తను ఎన్నుకున్న సుడిగుండంలోనే మసి అయిపోయాడు.

రైలు తనకేమీ పట్టనట్లుగా సిగ్నల్స్ పడగానే కదిలి వేగం పుంజుకుంది.

అందరూ నిద్రపోతున్నారు.